# కాట్రేని కోన

కేవలం శాస్త్రవిద్యలు చదివితే_ సదస్య సంభావనలకు వెళ్ళవలసిందేగాని_ కుర్చీఎక్కి_ ఉద్యోగంచేసే యోగ్యత ఉండదని అప్పటికే రుజువవుతోంది.

సరే ఉభయభాషా ప్రవీణ (ఎ) ప్రవేశ పరీక్షకు వెళ్ళడానికి ఖాయం చేశాం. అప్పుడు ఆ పరీక్షకు అన్నీ సంస్కృతం పుస్తకాలే. 1928 నాటికి ఇంకా తెలుగు "ఎంట్రన్సు" అవతరించలేదు.

కావ్య నాటకాలు ఆ గ్రామంలోని గురువులు క్షుణ్ణంగా చెప్పారు. అలంకారం, ప్రతాపరుద్రీయం మాత్రం మాకు కొరకరాని కొయ్యకాలేదుగాని_ ఎవరైనా తార్కికులవద్ద చదవమని పెద్దల సలహా. దగ్గరలో ఎవరూ లెరు.

మా సహ విద్యార్థి వెంకటశాస్త్రి దూరంగా సముద్రం ఒడ్డున ఒక పల్లెటూళ్ళో ఒక శాస్త్రులు గారివద్ద ప్రతాపరుద్రీయం చదువుతున్నాడు. నాటక ప్రకరణందాకా వచ్చింది అతని చదువు. నన్ను కూడా వచ్చి

అక్కడే చదవమని ప్రోత్సహించాడు. కాని ఈ ఊళ్ళో వున్న సదు పాయం, ఆదరణ అక్కడ వుంటుందనే నమ్మకం లేదు.

అతని సహవాసంలో చదువు మీద చాలా మోజు వుంది. ఏమిటి చెయ్యడం? రెండు రోజులు మధనపడ్డాను.

ఎందుకో వెంకటశాస్త్రి ఆ ఊరు వచ్చాడు. ఏదో సాకుపెట్టి- అత నితో వెళ్ళడానికి నిశ్చయించాను. అక్కడ కుదరక తిరిగివస్తే నామర్దా- కనక మా చిన్నక్క- పిల్లలను చూడ్డానికి 'పలివెల' వెళ్ళుతున్నానని చెప్పి అతనితో బయలుదేరాను.

పెద్ద కాలవగట్టున బయలుదేరి అమలాపురం మీదుగా ఎనిమిది మైళ్ళ ప్రయాణం. తోవలో అనాతవరంలో భోంచేసి సాయంత్రానికి కాత్రేనికోన చేరాం.

వెళ్ళగానే గురువుగారి దర్శనం చేశాం. ఆయన నిజానికి- నన్ను చూసి సంతోషించారు కాని- వెలవెలబోతూ ఒక మాట అన్నారు. అబ్బాయీ, కోనసీమలా ఇక్కడ విద్యార్థులకు వసతి సౌకర్యం వుండదు. విద్యార్థులకు భోజనం పెట్టడం ఇక్కడ అలవాటు లేదు. అయినా- ప్రయత్నించిచూడు, రేపు...." అని సగంలో మాట ఆపేశారు.

శాస్త్రిలు గారు కుటుంబం ఇంకా తెచ్చుకోలేదు. ఒక గదిలో ఒంటరిగానే వుంటూ తమర్ని, తమ పిల్లలకు పాఠాలు చెప్పడానికి తెచ్చు కున్న ఒక సంపన్న ద్రావిడ కుటుంబం వారి ఇంట పాఠాలు చెబుతూ కాల క్షేపం చేస్తున్నారు. సంవత్సరానికి కొన్ని ధాన్యం, కొంత రొక్కం ఇస్తా రట. నెల జీతాలు లేవు. కుటుంబం తెచ్చుకునే వరకూ ఒకరిద్దరి ఇళ్ళలో వారికి భోజనం ఏర్పాటుచేశారు.

ద్రావిడుడయిన వెంకటశాస్త్రికి ఎట్లాగో అతి కష్టం మీద వసతి ఏర్పడింది.

"తమ పిల్లల చదువుకు తెచ్చుకున్న శాస్త్రులుగారు ఇతరులకు పాఠాలు చెప్పవలసిన అవసరం ఏమిటి? ఆయన దగ్గర చదువుకోడానికి వచ్చిన వారిని పోషించవలసిన బాధ్యత తమకేమిటి? పైగా ఇతరుల పశువులవల్ల తమ పిల్లల చదువుకు నష్టం ఉండదా?" అని వారి భావన అయివుండవచ్చు.

ఒక పెద్ద దీపాన్ని ఎన్ని దీపాలు వెలిగించుకున్నా ఎవరికీ నష్టం ఉండదనీ, పైగా చీకటి మరింతగా తొలగి కాంతి ఉద్దీపిస్తుందనీ వారికి తోచకపోవడం అక్కడికి వెళ్ళిన వారి దురదృష్టం!

శాస్త్రులుగారి సిఫార్సుమీద ఆ రాత్రికి భోజనం దొరికింది. నా స్థిరత్వం చూసుకోకుండానే ఆ రాత్రి వెంకటశాస్త్రితో నేనూ పాఠానికి కూర్చున్నాను.

శాస్త్రులుగారు అభ్యంతరం చెప్పలేదు.

నాటక ప్రకరణంలో పాఠం చెప్పారు.

తెల్లారింది. స్నాన సంధ్యాదులయాయి.

"శతం విహాయ భోక్తవ్యం" నూరు పనులు మానివేసి అయినా భోజనం సంపాదించుకోవాలి.

తిష్ఠ కుదిరితేగదా, నిష్ట.

ఇద్దరం బయలుదేరాం ఊళ్ళోకి. ఎక్కే గుమ్మం దిగే గుమ్మం.

కాశీఖండంలో వ్యాసుడూ, శిష్యులూ గతి జ్ఞాపకం వచ్చింది. ప్రతి యింటా భోజనం లేదనడానికి "రేడీమేడ్"గా ఏదో కారణం ప్రత్యక్షమయింది.

పది గంటలదాకా తిరిగాం. ప్రాణం విసుగొచ్చింది. చేతిలో భిక్ష పాత్ర లేదుగాని. వుంటే వ్యాసుడిలా నడిరోడ్డుమీద పగలగొట్టి ఉండే వాడను.

17 ఏళ్ళ వయస్సు. ఆకలిని అదుపులో ఉంచడం ఇంకా చేత కాలేదు,

ముఖం నిండా చెమట. కాళ్ళు లాగుతున్నాయి.

వెంకటశాస్త్రి చిన్నబుచ్చుకున్నాడు.

ఇంకా ఒక్క ఇల్లు మిగిలింది.

అక్కడ ఆతిథ్యం దొరికితే దొరకడం, లేకపోతే "నిత్యోపవాసం" గుమ్మం ఎక్కి వసారాలోకి వెళ్ళాం.

ఇల్లాలు చేటలో బియ్యం పోసుకుని సావకాశంగా ఏరుతోంది. పచ్చని ముఖంలో ఎర్రని కుంకుం బొట్టుతో ఆవిడ పద్మంమీద కూర్చున్న లక్ష్మీదేవిలా కనబడింది.

సగం కడుపు నిండింది.

వెంకటశాస్త్రి నా సంగతంతా చెప్పి ఈ పూటకు ఈ అబ్బాయికి భోజనం పెట్టండి అని అడిగాడు.

ఆమె తలయెత్తి చిరునవ్వుతో "ఈ వూళ్ళోనా? చదువుకా?" అని ఆశ్చర్యపడవలసిందంతా పడి "పాపం... రమ్మను. ఆయన పొలం

వెళ్ళారు. రావడం ఆలస్యం అవుతుంది. వంటకాగానే అతనికి పెట్టి పంపిం చేస్తాను" అంది.

సాక్షాత్తూ రాశిలో విశాలాక్షమ్మ "హస్త సంజ్ఞాదరలీల" భోజనానికి పిలిచినట్టుంది.

మెట్టు దిగుతూ వెంకటశాస్త్రి మందహాసంతో "వీరు మంగళం పల్లి వారు. మీ వాళ్ళు కనక నీకు భోజనం దొరికింది" అన్నాడు. మా వాళ్ళంటే? అప్పటికింకా మా వాళ్ళెవరో తెలియని అజ్ఞానిని,

మధ్యాహ్నం వారింట పెరుగుతో, కొంతరటిపళ్ళతో భోజనం చేసి తిరిగిన శ్రమ అంతా మరచిపోయి ఎండ వాటారగానే తిరుగుముఖం పట్టాను మా ఊరుకు.

తిరిగి వస్తూండగా పిల్లకాలువగట్టున ఒక పల్లెటూరు తగిలింది. దాని పేరు విలస. అప్పుడు ఆంధ్రదేశ చరిత్రలో దానికున్న విలువ నాకు తెలియదు.

1942లో మల్లంపల్లి వారు విలస తామ్రశాసనం ప్రకటించగానే ఉలూఘ్‌ఖాను ఆక్రమణతో తెలుగుదేశం గతి చూసి క్రక్కదలిపోయాను.

ఒక సాయంకాలం ఆ ఊరు పక్కగా వెళ్ళిన అనుభవాన్ని నా కీర్తితోరణకావ్యంలో ఉపయోగించుకున్నాను.

రాత్రి తొమ్మిది గంటలకు ఊరుచేరాను. అందరి భోజనాలూ ముగి శాయి. పిన్నిగారు అడిగితే మోమోటపడి పలిపెలలో భోజనంచేసి బయలు దేరానన్నాను. ఆ ఒక్కరాత్రి ఆకలి బాధంటే ఏమిటో జీవిత మంతటికీ సరిపోయేలా తెలుసుకున్నాను.